## శుక్రగ్రహం.

పడమట సూర్యుడు ఉదయించాడు.

ఏభై తొమ్మిది రోజులకు సమానమైన మహా రాత్రి ముగిసింది. ఇక దాదాపు రెండు నెలల వరకు అక్కడ పట్టపగలు.

అంతరిక్ష నౌక 'మేఘదూత్' శుక్రగ్రహానికి చేరువైంది. దాదాపు భూమంత పెద్దదయిన ఆ గ్రహం దట్టమయిన మేఘాల మాటున, దూదితో చుట్టబడ్డ బంతిలా ఉంది. అంతరిక్ష నౌక కిటికీ లోంచి ఆ దృశ్యాన్ని చూసిన భార్గవ సంతోషంతో కేరింతలు కొట్టాడు.

''మిషన్ కంట్రోల్, దిసీజ్ మేఘదూత్. భార్గవ రిపోర్టింగ్. ఏకిన దూదిలా ఉన్న ఈ మేఘాలు ఎంతో అందంగా ఉన్నాయి. ఈ దృశ్యం ఎంత అందంగా ఉందంటే ఈ నౌకలోంచి బయటకు వచ్చి నారదుడు తుంబురుడు లాగా మేఘాల మీద విహరించాలనిపిస్తోంది.''

''జాగ్రత్త. ఆ చల్లని మేఘాల అడుగున ఏముందో తెలుసుగా?'' మిషన్ కంట్రోల్ నుంచి మాట్లాడుతున్న ఉపాధ్యాయ నవ్వాడు.

''తెలుసు—శుక్రగ్రహం— పొట్లం కట్టిన వేడి పకోడి... నాకు పకోడీ అంటే ఇష్టం.''

''అందుకే కదా నిన్ను అక్కడికి పంపింది. అయితే ఒక విషయం. విషయాన్ని పరిశీలించకుండానే ఇష్టాయిష్టాల్ని పెంచుకోవడం శాస్త్రీయ దృక్పథం కాదు. పరిశోధనలో ఎక్సైట్‌మెంట్‌కి తావు లేదు. ప్రతి చిన్న విషయాన్ని ప్రశాంతంగా పరిశీలించడమే పరిశోధన.'' భార్గవ నౌక వివరాలు చెప్పాడు.

''మీ నౌక దిగవచ్చు. గుడ్‌లక్.''


''థాంక్యూ, మిషన్ కంట్రోల్. ఓవర్.''

భార్గవ కిటికీలోంచి చూశాడు. ఆ మేఘాల అందాన్ని ఎంత చూసినా తనివి తీరటం లేదు.

ఆ తెల్లటి మేఘాల పొట్లంలో ఏముందా అన్న విషయం కొన్ని వందల సంవత్సరాల పాటు ఖగోళ శాస్త్రజ్ఞుల్ని తికమక పెట్టింది. ఆ గ్రహం మీద నిరంతరం మబ్బు ఆవరించి ఉంటుందని, సూర్యుడు, నక్షత్రాలు ఉన్నాయన్న విషయం శుక్ర గ్రహ వాసులకి అసలు తెలియక పోవచ్చునని కొందరు అనుకునేవారు.

శుక్రగ్రహం తీరం లేని సముద్రమని, అక్కడ నిరంతరం ఈ అఖండ వర్షం కురుస్తుంటదని, ఆ ప్రపంచంలో నీరు తప్ప వేరే ఉండదని అనుకునే వారు మరి కొందరు.

సూర్యుడికి చేరువలో ఉన్న ఆ గ్రహంలో నీరు ఎప్పుడో ఆవిరై పోయి ఉంటుందని, అది మండే ఎడారి అని మరి కొందరు అనుకునే వారు. అక్కడ అంతా భూమిలాగే ఉంటుందని, కొండలు, లోయలు, నదులు, సముద్రాలు, అడవులు—వీటితో ఆ గ్రహం కళకళలాడుతుందని, విచిత్రమైన జంతువులు, విహంగాలు అక్కడ విహరిస్తూ ఉంటాయని సమాధాన పడేవారు మరి కొందరు.




భూమ్మీంచి పెరిస్కోప్‌లో మేఘాలని మించి ఇంకేమీ చూడలేని రోజుల్లో ఇలాంటి వూహలు కోకొల్లలు.

'రేడియో ఆస్ట్రానమీ' ఈ సందేహాల్ని పటాపంచలు చేసింది. ఇప్పుడు ఆ పొట్లంలో ఉన్న దేమిటో అందరికీ తెలుసు. అది వేడి వేడి పకోడి.

ఆ పకోడీ ఎర్రగా కాలిన మూకుడు కన్నా మూడు రెట్లు వేడిగా ఉంటుంది. ఆ పొట్లాన్ని ముట్టుకోవచ్చు. కాని పకోడిని ముట్టుకుంటే మాడి పోతాం.

మేఘదూత్ ఆ మేఘాలను చేరుకుంది. దిగడం ప్రారంభించింది. సుళ్ళు తిరుగుతున్న తెల్లని మేఘాలు నౌకని చుట్టుముట్టాయి. ఆ నౌకలో తమ గ్రహానికి వచ్చిన బంధువులు ఎవరో చూడాలని కుతూహలపడుతున్న శుక్రగ్రహ వాసుల ప్రతినిధుల్లా గుంపులు గుంపులుగా కిటికీ మీద మోహరించాయి ఆ మేఘాలు. ఆ కిటికీని తెరుచుకుని రావడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. దట్టంగా మేఘాలు కమ్మడంతో




అంతా చీకటైపోయింది. గాలి విసురుకి అంతరిక్ష నౌక అటూ ఇటూ వూగుతూంది. హోరు పెద్దదయింది.

చీకటి!

అంతా చీకటిమయం.

కమాండర్ కృష్ణ, భార్గవ రాడార్ని పరిశీలిస్తున్నారు. రామన్ పక్కనే కూర్చున్నాడు.

ఆ మబ్బుల మాటున ఏముందో రాడార్ని చూసుకుని తెలుసుకోవాల్సిందే తప్ప చూసి తెలుసుకునే అవకాశం లేదు.

"వేగం తగ్గుతోంది—ఇంజన్ కట్ చేస్తున్నాను" అన్నాడు కృష్ణ.

ఏమన్నా కనిపిస్తుందేమో అని కిటికీలోంచి చూస్తున్నాడు భార్గవ. ఇంజన్ కట్ అవ్వడంతో నౌక కింద భాగంలో ఉన్న జెట్ నెమ్మదిగా ఆగిపోయింది.

మేఘదూత్ దిగుతూంది.

అందరూ గుండెలు అరచేత్తో పట్టుక్కూర్చున్నారు. భూమిమీద ఈ లాండింగ్ ఎన్నిసార్లు రిహార్సల్స్ చేసినా, నిజమైన అనుభవం ఎదురైనప్పుడు భయం తప్పలేదు. నౌక ఎక్కడైనా దిగచ్చు. కింద కమ్ముకున్న మేఘాల్లో ఏమీ కనిపించదు.

రాడార్ని చూస్తూ నడిపినా అనుమానం అనుమానమే. తప్పు చేశామేమో అన్న భయం గుండెను మెలి పెడుతూంది.

తాము దిగేది చదునైన నేల అయితే ఫరవా లేదు. కాని అదే పదునుగా ఉన్న కొండ శిఖరం అయితే బాలెన్స్ తప్పి లోయలోకి పడిపోతుంది మేఘదూత్.

ఒకవేళ అంతులేని గొయ్యిలో దిగితే...

ఒకరితో ఒకరు చెప్పుకోకపోయినా అందరి మనసుల్లో భయాలు, భ్రాంతులు ఒక్కటే.

"ఢప్" మన్న శబ్దం వినిపించడంతో అప్రయ

త్నంగా కళ్ళు మూసుకున్నారు. మేఘదూత్ పక్కకి ఒరిగినట్టే ఒరిగి బాలెన్స్ నిలదొక్కుకుంది. నేల మీద జర్రున ముందుకి జారి ఆగింది.

ఆ తరవాత అది స్థిరంగా నిలబడింది.

ముగ్గురూ కళ్ళు తెరిచి చూశారు. అంతా సవ్యంగానే ఉంది. నేల కనిపిస్తోంది.' వాళ్ళు ఆనందంతో ఒకర్నొకరు కౌగిలించుకున్నారు. పరస్పరం వెన్ను తట్టుకుని ధైర్యం చెప్పుకున్నారు.

కనీసం ఒకరేనా అంతరిక్ష నౌకలో ఉండాలి కాబట్టి రామన్‌కి చార్జి అప్పగించి, స్పేస్ సూట్ వేసుకుని బయటికి వచ్చారు కృష్ణ, భార్గవలు.

"ఇప్పుడు సూర్యోదయం అవ్వాలి కదూ!" భార్గవ తూర్పు వైపు చూశాడు.

"భార్గవా! పప్పులో కాలేశావు. ఇక్కడ సూర్యుడు పడమట దిక్కు ఉదయిస్తాడు. భూమి తన చుట్టూ తను తిరిగే దిశకి వ్యతిరేకమైన దిశలో తిరుగుతూంది శుక్రగ్రహం. అందువల్ల ఇక్కడ సూర్యుడు పడమట ఉదయించి తూర్పున అస్తమిస్తాడు. ఎక్కడ ఉదయించినా, అస్తమించినా ఇక్కడ సూర్యుడి ప్రభావం ఏమీ లేదు. దట్టమయిన మేఘాల్లోంచి అసలు సూర్యుడు కనిపించడు. సర్వకాలం ప్రాతఃవెలుగు, సంజె వెలుగులే కనిపిస్తాయి."

భార్గవ నవ్వాడు.

"అలవాటులో పొరపాటు" అన్నాడు.

శుక్రగ్రహపు దక్షిణ ధృవం ఇంకా ముప్పై కిలోమీటర్లుంది. గ్రహం మధ్యలో కంటే ఈ ధృవప్రాంతంలో మేఘాల సాంద్రత కొద్దిగా తక్కువగా ఉంది. ధృవ ప్రాంతం దగ్గరవుతున్న కొద్దీ వాతావరణం కొంచెం స్పష్టంగా ఉంది. దాదాపు రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న కొండలు, శిఖరాగ్రాలు కనిపిస్తున్నాయి. రాడార్ సహాయం లేకుండా కంటితో చూస్తూ నడవచ్చు. మేఘాల మాటునుంచి కురుస్తున్న ఆకు పచ్చటి మసక వెలుతురులో వాళ్ళు సముద్రం అట్టడుగున ఉన్నట్టు భ్రాంతి కలిగింది. దూరంగా ఉన్న వస్తువులు ఆ మసకలో అతుక్కుపోయి, తరంగాల్లో కొట్టుకు పోతున్నట్టుగా కనిపించడంతో ఆ భావన మరింత బలపడింది. సముద్రపు అడుగునకూడా ఇలాగే మసగ్గా ఉంటుంది. అయితే అక్కడ ఎముకలు కొరికేంత చలిగా ఉంటుంది. కాని ఇక్కడ...

మేఘాల సముద్రపు అడుగున బడబాగ్ని...

ఇది బాయిలర్లలోను, ఫర్నేస్‌లలోను ఉండేంత వేడి ( 48. పి ) మరిగే నీటికి అయిదు రెట్లు, కాలే పెనంకి మూడు రెట్ల వేడి.

తలెత్తి చూశాడు.

ఎదురుగా ఉన్న ఆ దృశ్యం భయంకరంగా కనిపించింది. ఒళ్ళు గగుర్పొడిచింది. కొండలు మెమ్మదిగా కదులుతున్నట్టుగా, ఊగుతున్నట్టుగా కనిపించింది.

భూమ్మీదకూడా ఫర్నేసుల్లో సల మరిగె లోహాల్ని మంటల్లోంచి చూస్తే ఇలాగే కదులుతున్నట్టుగా కనిపిస్తాయి.

ఇది భ్రాంతి.

ఆప్టికల్ ఇల్యూషన్.

ఆ సంగతి వాళ్ళకి తెలుసు. అయినా భయం..'

ఇక చూడలేక తల పక్కకి తిప్పాడు.

ఎదురుగా మైళ్ళతరబడి విస్తరించిన రాతి ఎడారి. ఏ అలికిడిలేని నిర్జీవమైన, నిరామయఃవాతావరణం.

ఇక్కడ జలజలా పారే సెలయేళ్ళు లేవు. కన్నుల విందు చేసే పచ్చని చెట్లు లేవు. రంగుల పూలు లేవు. కుహూ కుహూ అని పలకరించే పక్షులు లేవు. అడపా తడపా పరుగెడుతూ ఆడుకునే జంతువు ల్లేవు.

ఎక్కడ చూసినా కొండలు, లోయలు.

ఒంటరితనం.

నిశ్శబ్దం.

భయంకరమైన నిశ్శబ్దం.

గుండెకు గుబులు పుట్టించే నిశ్శబ్దం.

మనిషిని పిచ్చివాణ్ణి చేసే నిశ్శబ్దం.

దాన్ని చూడగానే భార్గవకి వెనక్కి తిరిగి వెళ్ళిపోదాం అనిపించింది. కాని అహం అడ్డొచ్చింది. తనకి వేడి పకోడీ అంటే ఇష్టం. ఇది వేడి పకోడీ. దీన్ని ఇష్టంగా పరిశీలించాలి. తనని తాను నిలదొక్కుకున్నాడు.

మూడు డియర్!
సోమా వలన ప్లంబింగ్ ఖర్చులలో ఇప్పుడు ఎంత ఆదా చేయగలుగుతునామో!

ఔను నిజంవే! ఆదా చేయడం కూడా ఒకలాంటి గండిం పేకదూ!



సోమా మెటల్ ఫిటింగ్స్

ఇంటికయ్యే ఖర్చులలో ఒక తగ్గింపు ఎందుకో తెలుసా ఇంటావిడ కూడా దీని బాగోగులను చూసుకోగలదు—ఎప్పుడైనా అవసరమైతే.

"నేను మా శ్రీవారితో అంటూ ఉంటాను, ఏ ఆఫీసులో నేను పని చెయ్యకుండానే గడిస్తున్నాను—ఇంటి ఖర్చులలో ఆదా చేస్తూనే. ఆదా చెయ్యడానికి నాకు సోమా వల్ల అత్యంత సహాయం లభిస్తోంది. ఎందుకో తెలుసా ఇప్పుడు నేను ఏ ప్లంబర్‌కి ఏంపీ ఎప్పుడూ ఇవ్వనవసరం లేదు.


ఇంతే కాదు సోమా ఫిటింగ్స్—కఠినమైన మరియు ఉప్పునీరుతో కూడిన నీళ్ళు వచ్చే ప్రదేశాలలో కూడా ఏ యిబ్బందులు లేకుండా బహుగా పని చేస్తాయి. బాగు ప్లంబర్స్ దొరకని సుదూర ప్రాంతాలలో సోమా ఒక నిజమైన వరంలాంటిదే."

సోమా ప్లంబింగ్ ఫిక్స్చర్స్ లిమిటెడ్

తయారీ దారుల సౌజన్యంతో
VITREOUS హిందూస్థాన్ శానిటరీవేర్
2, రెడ్ క్రాస్ ప్లేస్, కలకత్తా 700 001 భారత దేశము

SAA/SPF/6TEL

NO. 13




కృష్ణ అప్పుడే ఫొటోలుతీస్తున్నాడు. బైనాక్యులర్స్ లోంచి పరిశీలించి చూస్తున్నాడు. తన భావాల్ని, పరిశీలనల్ని టేప్‌రికార్డర్‌లో డిక్టేట్ చేస్తున్నాడు.

"భార్గవా ఇటు చూడు" అరిచాడు కృష్ణ.

"అద్సా... అది ఎండిపోయిన జలపాతం కావచ్చు" అన్నాడు భార్గవ.

"అది కరెక్ట్. నాకూ అలా అనిపించింది. ఇక్కడ నదులున్నాయి. అయితే కాలవల్లో, నదుల్లో ప్రవహించేది నీరు కాదు. నీటి ఆవిరి. ఇక్కడ మేఘాలు అలా తిరగాల్సిందే తప్ప చల్లబడి వర్షించ లేవు."

కృష్ణ థర్మామీటర్ చూశాడు.

"టెంపరేచర్ ఎంత?" అడిగాడు భార్గవ.

"100० సి."

"ఇంకొంచెం చల్లబడితే ఇక్కడ వర్షం కురుస్తుంది." భార్గవ ఆలోచిస్తున్నాడు.

"మనం శుక్రగ్రహం మీద అతి చల్లగా ఉండే ధ్రువ ప్రాంతానికి దగ్గరగా ఉన్నాం. పైగా ఎత్తు మీద ఉన్నాం. అందులోనూ ఇది చలికాలం. ఈ గ్రహం మీద వాతావరణం ఇంతకన్నా చల్లగా ఉండే అవకాశం లేదు" అన్నాడు కృష్ణ.

భార్గవ నిట్టూర్చాడు.

"టెంపరేచర్ ఇంకొన్ని డిగ్రీలు పడిపోతే ఇక్కడ వర్షం కురుస్తుంది. కురిసేది ఆవిరే కావచ్చు. కాని నీరు నీరే. నీరుంటే జీవి ఉండచ్చు. ఇంత భయంకర వాతావరణంలో ఒక ప్రాణంటూ ఉందని తెలుసుకుంటే ఎంత సరదాగా! ఆ ప్రాణి—అది ఆల్గే కావచ్చు, అమీబా కావచ్చు—ఈ నిర్జీవ, నిరామయ వాతావరణంలో అది ఆత్మబంధువులా కనిపిస్తుంది."

భార్గవ ఎదురుగా చూశాడు. ధ్రువానికి దగ్గరగా కొన్ని కొండ లున్నాయి. వాటిమీద ఉష్ణోగ్రత మరి కొన్ని డిగ్రీలు తక్కువగా ఉండచ్చు. వర్షం కురియడానికి అనువుగా ఉండచ్చు. ఇక్కడే జలపాతానికి గుర్తులు కనిపించినప్పుడు అక్కడ జలపాతాలు కనిపించ వచ్చు. అక్కడి దాకా వెళ్ళి, ఆ కొండలు ఎక్కితే ఆ కొండ చరియల్లో ఏదన్నా వాగు కనిపిస్తే, ఆ వాగులో ఏదేనా ప్రాణి జలక మాడుతూంటే...

వాహ్! తన లాంటి జంతుశాస్త్రజ్ఞుడికి ఎంత పండుగ!

"కృష్ణా! నేను ధ్రువప్రాంతానికి వెళతాను."

"అది ఎంత దూరమో తెలుసా?"

"తెలుసు. ముప్ఫై కిలోమీటర్లు."

"అక్కడికి మేఘదూత్ వెళ్ళదు."

"ఫరవాలేదు. నడిస్తే పది పన్నెండు గంటల్లో చేరుకోవచ్చు. ఆ మాత్రం కష్టనష్టం మనకి లెక్క కాదు. మనం ట్రైనింగ్‌లో ఎలా పని చేసే వాళ్ళమో గుర్తు తెచ్చుకో."

"భార్గవా! ఇక్కడ వాతావరణం సంగతి నీకు తెలియంది కాదు. ఇక్కడ గాలిలో తొంభై శాతం బొగ్గుపులుసు గాలి (102). అది దట్టంగా అల్లుకు పోయింది. సూర్యకిరణాలు ఈ పొరని ఛేదించుకుని లోపలికి వచ్చి రాళ్ళమీద పడతాయి. ఆ ఇన్‌ఫ్రారెడ్ కిరణాల్ని ఆ రాళ్ళు గ్రహించి వేడెక్కుతాయి. వేడెక్కిన ఆ రాళ్ళ వాతావరణంలోకి తిరిగి ప్రసరించే వేడి బొగ్గు పులుసుగాలి పొరని ఛేదించుకుని పైనున్న వాతావరణంలోకి వెళ్ళలేదు. అందువల్ల లోపలి వేడి బయటికి పోయే మార్గం లేక బాయిలర్లో ఉన్నట్టుగా కుతకుత లాడుతూంది ఈ వాతావరణం. చలికాలంలో ధ్రువ ప్రాంతాల్లో వర్షం కురిసి చెరువులు నిండినా ఆ నీరు సలసల కాగుతూ ఉంటుంది. ఆ నీటిలో ఏదీ బతకలేదు."

"ఆ నీటిలోకూడా బతికే ప్రాణి ఒకటుంది. అది ఆల్గే."

"అదీ ఒక ప్రాణా? అది ఏక కణజీవి. మనం వెతికేది మనతో మాట్లాడే ప్రాణుల కోసం." కృష్ణ వాదించాడు.

"అది మీరు. నా లాంటి జంతుశాస్త్రజ్ఞులకి ప్రతి ప్రాణీ ముఖ్యమే. ఈ గ్రహం మొత్తంమీద ప్రాణి ఉండే అవకాశం ఉంటే అది ఆ కొండమీదే ఉంటుంది. ఇంత దూరం వచ్చి చూడకుండా ఎలా వెళ్ళాలి?"

"సరే, నీ ఇష్టం. రూల్ ప్రకారం మనం ఏం చేసినా మేఘదూత్‌లో ఉన్న రామన్‌కి చెప్పాలి."

"చెప్పు. అతను దీనికి ఒప్పుకోక పోవచ్చు. అతను ఇంజినీర్. ఇంజినీర్లకి అంతా తొందరే. తక్కువ సమయంలో, తక్కువ శ్రమతో, తక్కువ ఖర్చుతో పని అవ్వాలి. అది ఎలా ఉన్నా ఫరవాలేదు. మనం సైంటిస్టులం. మనకి సమయం, ఖర్చుతో లెక్క లేదు. కొత్త విషయం కనుక్కోవడం ప్రధానం."

రామన్‌కి చెప్పి బయలుదేరారు.

ఆ రాళ్ళలో నడవటం కష్టంగా ఉంది. వాళ్ళు నదిలో ఉన్నట్టుగా వాళ్ళమీంచి ప్రవాహం అతి సుతారంగా—నెమ్మదిగా ప్రవహిస్తున్నట్టుగా ఉంది. అప్పుడప్పుడు చిన్న చిన్న రాళ్ళు ఆ గాలికి ఎగిరి నెమ్మదిగా నేలమీద పడుతున్నాయి. నేలమీద అడుగు పెట్టినప్పుడల్లా కాలికింద ధూళి పైకి లేస్తోంది. ప్రవాహం లాంటి గాలి దాన్ని తనతో పాటు లాక్కు పోతూంది. ఆ గాలికి ఎవరో వీపు మీద చేతులు పెట్టి ముందుకు వెళుతున్నట్టుగా ఉంది. నదిలో నీటికి వాలుగా నడుస్తుంటే ఎలా ఉంటుందో అలా ఉంది. అదృష్టవశాత్తు గాలి తాము వెళ్ళే దిక్కుగానే వీస్తోంది. దానికి ఎదురీదాల్సి వస్తే చచ్చుండేవాళ్ళు. వంగి వంగి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. కొండ అంచు చేరుకున్నారు.

ఎంతో శిక్షణ, పట్టుదల ఉన్నా ఆ కొండ ఎక్కాలంటే భయం వేస్తోంది. వీపుకు తగిలించుకున్న ఆక్సిజన్ సిలిండర్లోంచి స్వచ్ఛమైన ప్రాణవాయువుని పీలుస్తున్నా శక్తి చాలడం లేదు. అయినా ఎక్కడం మొదలెట్టారు. వాళ్ళు వేసుకున్న థర్మోస్పేస్ సూట్‌లో ఉన్న రిఫ్రిజిరేటర్, వీపున ఉన్న ఆక్సిజన్, మోస్తున్న పరికరాలు—ఇవన్నీ కలిసి వెరసి భూమ్మీద యాభై కిలోలుంటాయి. శుక్రగ్రహం మీద వీటి బరువు నలభై నాలుగు కిలోలే! అయినా అది బరువే!

ఎక్కుతున్న కొండమీంచి జలపాతం ప్రవహించిన గుర్తు కనిపించింది. దీన్ని జలపాతం అనాలా, ఆవిరి పాతం అనాలా?

భార్గవ అడుగు ముందుకు వెయ్యబోయాడు.

"ఆగు" అన్నాడు కృష్ణ.

"ఎందుకు?"


"మనం ఆ రాయికి అవతల వైపుకి వెడితే మేఘదూత్‌తో మనకి రేడియో కాంటాక్ట్ పోతుంది. అలా జరగడానికి వీల్లేదు."

భార్గవ ఆలోచించాడు.

"నువ్వు చెప్పేది నిజమే. నువు ఇక్కడే ఉండు. నేను వెళ్ళొస్తాను. ఒకవేళ ఏ కారణం చేతనైనా నేను తిరిగి రాకపోతే నువ్వు వెళ్ళిపో."

"భార్గవా!" కృష్ణ కోపంగా అరిచాడు. "నేను దీనికి ఒప్పుకోను. తిరిగి వెళ్ళి పోదాం రా."

"నేను ఈ కొండ చివరి దాకా ఎక్కుతాను. దానికి అవతలి వైపుకి జలపాతం పారినట్టు కనిపిస్తోంది.




దాన్ని చూడాలి.'' అతను అడుగు ముందుకు వేశాడు.

భయపడుతున్నట్లే ప్రార్థిస్తూ అక్కడే ఉండిపోయాడు కృష్ణ.

కొండ ఎక్కాడు భార్గవ. ఉష్ణోగ్రత 100°సి. కొండకి అవతలి వైపున కాలవ లాంటిది కనిపించింది. దిగాడు. కాలవ ఖాళీగా ఉంది. ఇది ఖాళీగా ఉందా? లేక దీంట్లోంచి ఆవిరి పుడుతోందా? ఇంకా తను అలా నిలుచుంటే తనని ఒక ఆవిరి కెరటం కొడుతుందా? లేదా ఒక ఆవిరి ఉప్పెనతనని ఇక్కడ శాశ్వతంగా సమాధి చేస్తుందా? అతను మరో రెండడుగులు వేశాడు. అతనికి మొట్టమొదటిసారి భయం వేసింది.

ఒంటరితనం ఆవరించుకుంది.

భూమినుండి కొన్ని లక్షల మైళ్ళ దూరంలో ఉన్నా తనని ఇంతవరకు ఈ భావన ఆవరించ లేదు. కారణం తను కావలసిన వాళ్ళతో చటుక్కున రేడియోలో మాట్లాడేవాడు. సహ అంతరిక్ష యాత్రికులున్నారు. కాని ఇప్పుడు...

ఇప్పుడు అందరూ ఉన్నా ఎవరూ లేనట్టే.

అరిచి గీ పెట్టినా ఎవరికీ తెలియదు.

కొన్ని గజాల దూరం తనని మిగిలిన మానవాళి నుంచి వేరు చేసింది. చిత్రం—లక్షలమైళ్ళ ప్రయాణం కన్నా కొన్ని గజాల ప్రయాణం ఎంత ప్రమాదభరితమైంది!

అతను గాలిని పరిశీలించాడు. ఆక్సిజన్ సాంద్రత పెరిగింది. గ్రహం మధ్యలో పది లక్షలకి ఒకటి మాత్రం ఉండే సాంద్రత పన్నెండుకి పెరిగింది. ఇంత కొద్దిగా ఉన్న ప్రాణవాయువుని పీల్చుకుని ఏ ప్రాణి బతకలేదు.

కాని ఈ ఆక్సిజన్ ఎలా వచ్చింది?

భూమిమీద ఆక్సిజన్ తనంతట తనే రాలేదు. చెట్ల మూలంగా వచ్చింది. చెట్లు లేనప్పుడు భూమి మీద వాతావరణంకూడా ఇలాగే విషపూరితంగా ఉండేది. అంటే...

ఇక్కడకూడా ఎంతో కొంత జీవరాసి ఉంది. ఆలోచిస్తున్న భార్గవకి పైన గాలిలో చాప లాంటిది రావడం కనిపించింది. అది సూటిగా తనవైపే వస్తోంది. క్షణం పాటు అతని గుండె ఆగిపోయింది. గాలిలో తేలుతున్న ఏదేనా మృగం తన మీదకి దండెత్తి వస్తోందా? తనని శత్రువుగా భావిస్తోందా? అని భయం వేసింది. క్షణం తరవాత తడబాటు తగ్గింది. తన భయానికి తనే నవ్వుకున్నాడు. జంతు శాస్త్రజ్ఞుడైన తనే ఎలా భయపడుతున్నాడు!

రిఫ్లెక్టింగ్ మెటల్ రేకుతో తల నుంచి కాళ్ళ దాకు కప్పే రక్షక కవచం లాంటి థెర్మోసూట్—తలమీద ఈకల్లా హెల్మెట్లోంచి పొడుచుకొస్తున్న ఆంటెనా. వీపుమీద వేలాడే ఆక్సిజన్ సిలిండర్. ముఖాన్ని కప్పే లెన్స్‌లోంచి భయంకరంగా కనిపిస్తున్న కళ్ళు. ఈ థెర్మోస్పేస్‌సూట్‌లో తనని చూస్తే సింహానికే గుండె దడదడ లాడుతుంది. అన్ని మృగాల కన్నా క్రూరుడు మనిషి. తనని చూసి ఇక్కడ జీవరాసులు భయపడాలి కాని, తనకి భయమేమిటి? తనని భయపెట్టే జీవరాసి ఈ గ్రహంలో జీవించలేదని తెలిసినా ఇంకా భయం ఎందుకు? మనిషి నిజం కన్నా ఊహని చూసి ఎక్కువ భయపడతాడు.

ఆ పల్చటి చాప అతని నెత్తి మీదికి వచ్చింది. దాంట్లోంచి చిన్న ముక్కని ఛేదించడానికి ప్రయత్నించాడు. అది తనికి దొరకలేదు. మళ్ళీ ప్రయత్నించాడు. అలాగే జరిగింది. మూడోసారి ప్రయత్నం చేయగా అది అతన్ని దాటి అడుగు ముందుకు పోయింది. తను కొండ శిఖరంమీద ఉన్నాడు—అడుగు ముందు కేస్తే అగాధంలోకి పడిపోతాడు.

భార్గవ రక్తం పొంగింది. దానికి వెంట పడి పరిశోధించాలన్న కోరికతో రక్తం మరిగి పోయింది. కాని ఎలా?

అది గాలిలో ఎగిరి పోతోంది. తను దాన్ని అందుకోలేదు. దాంట్లో తప్పక ఏదో జీవి ఉంటుంది. ఈ విషపూరిత వాతావరణంలో జీవించడానికి, వాయువుల్ని సృష్టించడానికి భయంకరంగా పోరాడుతున్న ఆ జీవి ఎవరు? అది తెలుసుకోలేక పోయాడు.

అతనికి ఎక్కడలేని నీరసం ఆవరించింది.

''నేను ఓడిపోయాను.'' బాధగా అరిచాడు. అది ఎవరికి వినిపించిందో అతనికి తెలియదు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నిస్పృహతో ఆ చాప వైపు చూశాడు. నీళ్ళు ఇంకిపోయాయి. తన కెందుకిలా బాధ కలిగింది? దాంట్లో జీవి ఉందో, లేదో తెలియదు. ఒక వేళ ఉన్నా అది తనతో మాట్లాడలేదు. అయితే ఎవరో ఆప్తుణ్ణి కలుసుకోలేక పోయినట్టుగా ఎందుకిలా బాధ పడుతున్నాడు! అతను ఆ శిఖరం మీద నిర్జీవంగా నించున్నాడు.

ఏ గ్రహంలోనైనా ఒక జీవం అంటూ ఉంటే అది మనిషికి గొప్ప అండ. ఈ విశాల విశ్వంలో భూమి ఒంటరిది కాదని, భూమిలా జీవంతో కళకళలాడే గ్రహాలున్నాయన్న భావన కొండంత బలాన్ని ఇస్తుంది. ఈ సౌర కుటుంబంలో ఉన్న ఏ గ్రహంమీదా మనిషితో మాట్లాడే జీవరాసి లేదు. అయితే కోట్లాది సూర్యుళ్ళు, కోట్ల కోట్ల గ్రహాలు ఉన్న ఈ విశాల విశ్వంలో ఎక్కడో కోట్ల కోట్ల కోట్ల మైళ్ళ దూరంలో ఉన్న కొన్ని లక్షల గ్రహాల్లోనైనా మనిషిని పోలిన జీవి, మనిషికన్నా తెలివైనజీవి ఉండచ్చు. వాళ్ళతో సంబంధం పెట్టుకునే రోజు రావచ్చు. దానికి చాలా సమయం పడుతుంది.

తనకన్నా తెలివైన జీవి వచ్చి బాధ్యత స్వీకరించే వరకు తనకు తెలిసిన ప్రాణుల్ని గౌరవించడం, తన కన్నా బలహీనమైన జీవుల్ని కాపాడ్డం మనిషి కర్తవ్యం. జంతు శాస్త్రజ్ఞుడిగా తన జీవిత ధ్యేయం అదే.

''నా నేస్తం. ఏదో ఒక రోజు తిరిగి మాలో ఎవరో ఒకరు నిన్ను కలుసుకుంటారు. అప్పుడుకూడా ఇలా దొరక్కుండా పారిపోయే మనిషి క్రూరుడు. చాలా చెడ్డవాడు. ఈ సృష్టికి తనే అధికారినని భావిస్తాడు. సృష్టిలో ఉన్న మిగిలిన ప్రాణుల్నింటిని తన తాత్కాలిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు. చెట్లని కొట్టేస్తాడు. జంతువుల్ని వేటాడతాడు. చంపేస్తాడు. వాతావరణాన్ని కాలుష్యంతో నింపేస్తాడు. అది అతని తప్పు కాదు. స్వర్గతుల్యమైన భూమ్మీద పుట్టి, సుఖప్రదమైన వాతావరణంలో పెరిగిన మనిషికి దాని విలువ తెలియదు. అతను ఒకసారి ఇలాంటి గ్రహం మీద అడుగు పెడితే భూమి ఎంతటి స్వర్గధామమో, అలాంటి స్వర్గాన్ని సృష్టించిన సముద్రాలు, వృక్షాలు, జంతువులు ఎంత విలువైనవో అర్థమవుతుంది.

''నిజమే. మేము జీవరాసి పట్ల, ప్రకృతి పట్ల అన్యాయం చేస్తున్నాం. అంత మాత్రాన కోపగించుకుని మాకు దొరక్కుండా పోవద్దు. మాలో శాస్త్రజ్ఞులున్నారు. భూతదయ గల మహనీయులు ఉన్నారు. మనీషులున్నారు. వాళ్ళమీద గౌరవంతో మాతో స్నేహం చెయ్యి.''

దానికి కన్నీటితో వీడ్కోలు చెప్పి కిందికి దిగాడు.

కృష్ణ అక్కడ ఎదురు చూస్తున్నాడు.

"నేను అలిసిపోయాను" అన్నాడు భార్గవ.

కృష్ణ షిప్పు మీంచి కిట్ తీశాడు. గాలిని నింపి ప్లాస్టిక్ టెంట్ నిర్మించాడు. దాంట్లో దూరి 'ఎయిర్ లాక్' వేసుకుని విశ్రాంతికై పడు:ం వాల్చాడు.

భార్గవ ఒక రేకు తీసుకుని దానిమీద మనసులోని భావాల్ని రాశాడు. ఒక గంట అయ్యాక "వెడదాం" అన్నాడు కృష్ణ.

టెంట్‌లోంచి గాలి తీసేసి మడిచి షిప్పుకి తగిలించుకున్నాడు. "ఒక్క క్షణం" అన్నాడు భార్గవ. కృష్ణ ఆగాడు.

"ఆ రేకుని బయటికి తీసి ఒక కర్రకి తగిలించి జెండాలా చేశాడు. ఆ నేల మీద గజం లోతు గొయ్యి తవ్వి దాన్ని పాతి పెట్టాడు.

"నన్ను తప్పించుకు పోయిన
వో శుక్రగ్రహ నేస్తం
నీవు అల్గేవో
లేక ఏకకణజీవివో
మాకు తెలియదు.
ఈ విషపూరిత వాతావరణంలో
ఈ భయంకర నరకంలో
మా లాంటి ప్రాణుల్ని సృష్టించడానికి
నువ్వు చేస్తున్న ఒంటరి ప్రయత్నానికి
నీ వీరోచిత పోరాటానికి
మా మానవాళి జోహార్లు
నీ లాంటి జీవి మా భూమి మీద
కోట్ల సంవత్సరాలు జరిపిన పోరాటానికి
ప్రతిఫలం... మేము!
నీ ఒంటరి పోరాటానికి
మద్దతు నివ్వాలన్నది మా ఆశ.
అది ఏదో రోజు జరుగుతుంది.
అంతవరకు...
మాలో మేము కలహించుకోమని
నీ వారసులు
మా ప్రాణదాతలు అయిన
చెట్లని చేమల్ని, జంతుజాలాన్ని
వాతావరణాన్ని
కంటికి రెప్పలా కాపాడుకుంటామని
సహజీవనంలో మాధుర్యాన్ని విస్మరించమని
తాత్కాలిక ప్రయోజనం కోసం
దేన్నీ నాశనం చెయ్యమని.
భూమ్మీద ఉన్న
నీ కోట్ల కొద్దీ బంధువుల తరపున
వాగ్దానం చేస్తున్నాను.
కక్ష, కార్పణ్యం
స్వార్థం, సంకుచితత్వం
యుద్ధం, బీభత్సం
లేని సహజీవనం
ఎంత మధురమైంది?

ఆ జెండాని ఆఖరిగా చూసి, వాళ్ళు, మేఘదూత్ దగ్గర కెళ్ళారు. అది భూమివైపు ప్రయాణం ప్రారంభించింది.



ఎవరునాటిన విత్తొ నేడు చెట్టయ్యింది
ఏనాటి వృక్షమో ఎన్ని చరితల ఘట్టమో
తాను ఎదుగుతు నీడ చేరినవారి
నాదరించిన మహా వృక్ష మిదిగొ
చూడ చిత్రరువులా చూపరుల నిల వేసి
చెప్పునెన్నో కధల కాలవాహిని నిలచి!

(పిల్లల మర్రిలో జరిగిన ప్రదర్శనలో ప్రదర్శించినది)

ఫోటో :
బి. సీతారాం